

## కేటీఆర్‌ని కలిసిన ఎమ్మెల్సీ

ఉట్నూర్ రూరల్, జనవరి 2 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును ఎమ్మెల్సీ దండే విఠల్ కలిశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

## 'ప్రజాపాలన'ను పరిశీలించిన కలెక్టర్



ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అశిష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్/సోన్, జనవరి 2 : నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్, రాంనగర్.. సోన్ మండలంలోని కడ్తాల్, గంజాల్ గ్రామాల్లో మంగళవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలను నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీదారులు ఇచ్చే దరఖాస్తుల్లో అన్ని వివరాలు నమోదు చేశారా? లేదా? అని కౌంటర్ సిబ్బంది చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి కేంద్రం వద్ద సమాచారం అందించడానికి సిబ్బందిని నియమించాలని సూచించారు. అర్జీదారు దరఖాస్తు స్వీకరించిన వెంటనే రసీదు ఇవ్వాలని, రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఆయన వెంట జడ్పీ సీఈవో సుధీర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ శివరాజ్, ఎంపీవో కలీం ఉన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

## అభివృద్ధిలో రాజకీయాలు ఉండకూడదు..

ఆదిలాబాద్ రూరల్, జనవరి 2 : ఎన్నికల వరకే రాజకీయ నాయకులు.. గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులని, ఎవ్వరైనా ప్రజల మేలు కోరే పని చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నదని, వీటిని అర్హులకు అందేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



హంపోలి (కే)లో ప్రజాపాలన దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

## కాంగ్రెస్‌ను నిలదీస్తా..

- హామీలు అమలు చేయకపోతే అసెంబ్లీలో పోరాడుతా..
- ప్రజాపాలన కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా టౌన్, జనవరి 2 : ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే అసెంబ్లీలో పోరాడుతానని, కాంగ్రెస్‌ను నిలదీస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని హంపోలి (కే), ఇలేగాం, కుంసర, బోరిగాం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. అధికారులు దరఖాస్తు చేసుకున్న వారిలో పేదవారిని గుర్తించి పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో మోజమ్ హుస్సేన్, సర్పంచ్‌లు ప్రసాద్ పటేల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# దళితబంధుపై నీలినీడలు

### కేసీఆర్ సర్కారు హయాంలో నిధులు విడుదల

- రెండో విడుతకు ఇచ్చిన రూ.29 కోట్లు వెనక్కేనా?
- పంపిణీపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్ సర్కారు
- దళిత కుటుంబాల్లో అయోమయం
- కొనసాగించాలని దళిత సంఘాల డిమాండ్..

నిర్మల్, జనవరి 2(నమస్తే తెలంగాణ) : దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపిన 'దళితబంధు' పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం అర్హులైన ఒక్కో దళిత కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసింది. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయవద్దని ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో దళితబంధు పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అనే దానిపై నీలినీడలు కమ్ముకున్నాయి. కాగా.. పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తున్నదనే ప్రచారం జోరుగా సాగుతుండడంతో రెండో విడుత కింద ఎంపికైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కొనసాగించాలని డిమాండ్లు వస్తున్నప్పటికీ, పథకం కొనసాగింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటన చేయలేదు.

### రెండో విడుతలో మంజూరైన నిధులు వెనక్కేనా..!

మొదటి విడుతలో ఎంపికైన లబ్ధిదారులు తమకు నచ్చిన యూనిట్లను తీసుకొని వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. రెండో విడుత ప్రక్రియను ప్రారంభించిన సమయంలోనే ఎన్నికల షెడ్యూల్ రావడంతో పంపిణీ ప్రక్రియ నిలిచింది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా రెండో విడుత కింద 198 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. మూడు దశల్లో ఆర్థిక సాయాన్ని అందజేయాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా మొదటి దశలో ఒక్కో లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో రూ.3 లక్షల చొప్పున జమ చేసేందుకు రూ.29.16 కోట్లను విడుదల చేసింది. ఇదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేసే ప్రక్రియ ఆగింది. కాగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలు చేసేందుకు సానుకూలంగా లేదనే ఊహాగానాలు ఉన్నాయి. దీంతో విడుదలైన రూ.29.16 కోట్ల వినియోగంపై అధికారులకు స్పష్టత లేకుండా పోయింది.



నిర్మల్‌లో ఆటోమొబైల్ షాప్ ఏర్పాటు చేసుకున్న దళితబంధు లబ్ధిదారు రాకేశ్

### తొలి విడుతలో 261 మందికి..

కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత మొదటి విడుతలో నియోజకవర్గానికి 100 మంది చొప్పున.. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 261 మంది లబ్ధిదారులకు పథకాన్ని వర్తింపజేసింది. లబ్ధిదారులు హార్వెస్టర్లు, జేసీబీ యంత్రాలు, ఫర్టిలైజర్, కిరాణ, ఫొటోగ్రఫీ దుకాణాలు, ఆయిల్ మిల్, టెంట్ హౌస్, డెయిరీ ఫాం, గొర్రెల యూనిట్లు తీసుకున్నారు. ఒకవేళ లబ్ధిదారులు వ్యాపారాల్లో నష్టపోతే.. వారికి ఆర్థికంగా ఉండేందుకు రూ.52.20 లక్షల రక్షణ నిధిని అధికారులు జమ చేశారు.

### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ సర్కారు దళితబంధు పథకంలో భాగంగా జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోకవర్గాల్లో 200 మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ. 10 లక్షల చొప్పున మంజూరు చేసింది. లబ్ధిదారులు తమకిష్టమైన వ్యాపారం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ఇక మరో విడుతలో నియోజకవర్గానికి 500 మందికి చొప్పున సాయమందించేందుకు అర్జీలను స్వీకరించింది. రెండు నియోజకవర్గాల నుంచి 1000 మందిని ఎంపిక చేసే క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, ఈ పథకం అమలవుతుందా.. లేదా అన్న సందేహాలు కలుగుతున్నాయి. ఈ పథకం కొనసాగింపుపై స్పష్టత ఇవ్వాలని దళితులు కోరుతున్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు..



*కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రెండో విడుత దళితబంధు పథకాన్ని వర్తింప జేసేందుకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 198 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. వీరికి మొదటి దశలో కింద రూ.29.16 కోట్లను విడుదల చేసింది. ఇంతలోనే ఎన్నికల షెడ్యూల్ రావడంతో పథకాన్ని నిలిపివేశాం. దళితబంధు కొనసాగింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు వెళ్తాం.*

*- హన్మాండ్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, నిర్మల్.*



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్

## పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నేరడిగొండ, జనవరి 2 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని సావర్గాం గ్రామంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల రూపురేఖలు మారిపోయాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరిట కాలయాపన చేయడం తప్పా చేసేదేమి లేదని ఆరోపించారు. ముందుగా ఎమ్మెల్యే స్వగ్రామమైన రాజురాలో జగదాంబాదేవి సేవాలాల్ మహారాజ్ ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సజన్, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటరమణ, జాదవ్ కల్యాణి, అనూష, నాయకులు దేవేందర్‌రెడ్డి, శివారెడ్డి, రవీందర్‌రెడ్డి, గడ్డం భీంరెడ్డి, మహేందర్, పవన్, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

### ఇబ్బంది కలుగకుండా చూడాలి..

ఇచ్చోడ, జనవరి 2 : ప్రజాపాలనలో వచ్చే దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను సందర్శించారు. దరఖాస్తు ఫారాలు అందరికీ సరిపోయే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ తుకారాం పాల్గొన్నారు.

# కేంద్రంపై కన్నెర్ర



బేల : రాస్తారోకో చేస్తున్న డ్రైవర్లు



నిర్మల్ పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద వాహనదారుల బారులు

- హిట్ అండ్ రన్ కేసుల విషయంలో వాహనదారుల ఆందోళన
- ఆయిల్ ట్యాంకర్స్ డ్రైవర్ల ధర్నాతో నిలిచిన పెట్రోల్ సరఫరా
- ఆదిలాబాద్, నిర్మల్ బంకుల ఎదుట నో స్టాక్ బోర్డుల దర్శనం
- పెట్రోల్, డీజిల్ కోసం పరుగులు తీస్తున్న వాహనదారులు
- సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మద్దంటున్న అధికారులు

జైనథ్(బేల)/నిర్మల్ అర్బన్/భైంసా, జనవరి 2 : ఆదిలాబాద్ జిల్లా బేల మండల శాఖ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు మంగళవారం అంబేద్కర్ కూడలి వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు షేక్ జబి మాట్లాడుతూ.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రోడ్డు ప్రమాదాలపై కొత్త చట్టాలను తీసుకురావడం దారుణమన్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే డ్రైవర్లను బాధ్యులను చేసి.. వారి వద్ద నుంచే నష్టపరిహారం వసూలు చేసేలా నూతన చట్టం రూపొందించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఇలాంటి చట్టాలను అమిత్ షా వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో రాస్తారోకోలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు పాల్గొన్నారు.

### బంకుల వద్ద బారులు

హిట్ అండ్ రన్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఈ నిబంధనలను వ్యతిరేకిస్తూ ట్రక్కు డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ఆయిల్ ట్యాంకర్స్ డ్రైవర్ల ధర్నాతో బంకుల వద్ద ఇంధన సరఫరా నిలిచింది. దీంతో పెట్రోల్ కొరత వస్తుందనే భయంతో వాహనదారులు బంకుల వద్ద బారులుదీరుతున్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని బంకుల ఎదుట నో స్టాక్ బోర్డులు వెలిశాయి. కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని వాహనదారులు కూడా డిమాండ్ చేస్తున్నారు.

### సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మవద్దు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 2 : పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, సరిపడా నిల్వలు ఉన్నాయని ఆదిలాబాద్ జిల్లాలో పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మవద్దని తెలిపారు.

## అర్హులు దరఖాస్తు చేసుకోవాలి..

### నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

మామడ/సారంగాపూర్, జనవరి 2 : అభయ హస్తం కింద అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా మామడ మండలంలోని కొరిటికల్, పొన్కల్, పరిమండల్.. సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామాల్లో జరిగిన 'ప్రజాపాలన' గ్రామసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజల పక్షాన పోరాడుతానని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు, పింఛన్‌లతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 412 హామీల కోసం పోరాటం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు భోజవ్వ, భూమేశ్వర్, ఎంపీడీవో రమేశ్, జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, సర్పంచ్ మురళీకృష్ణ, ఉపసర్పంచ్ విలాస్, ఎంపీడీవో సరోజ పాల్గొన్నారు.



దరఖాస్తు ఫారాలను పరిశీలిస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

# చావే శరణ్యమా..?

- క్షణికావేశంలో పెరుగుతున్న ఆత్మహత్యలు
- జిల్లాలో ఏటా పెరుగుతున్న బలవన్మరణాలు
- వీధిన పడుతున్న కుటుంబాలు..
- ఒంటరవుతున్న జీవితాలు..ఆధారం కోల్పోతున్న పిల్లలు
- గతేడాది 239.. ఈ ఏడాది 244 మంది సూసైడ్

నిర్మల్ అర్బన్, జనవరి 2: వందేళ్లు గడపాల్సిన జీవితాలను కాదనుకొని క్షణికావేశంలో కొందరు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా నిలవాల్సిన తండ్రి, తోడుగా నిలవాల్సిన కొడుకు.. బిడ్డలకు అండగా నిలవాల్సి తల్లిదండ్రులు, అన్నదమ్ముళ్లు, అక్కా చెల్లెల్లు ఇలా ఒకరికొకరు తోడుగా నిలవాల్సిన వారు బలవన్మరణాలతో అంతులేని క్షోభను మిగులుస్తున్నారు. చిన్న చిన్న కారణాలతో తనువులు చాలిస్తూ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. ఒక్కోసారి కుటుంబ పెద్ద మరణంతో బతుకులు అగమ్యగోచరంగా మారుతున్నాయి.. జిల్లాలో ఆత్మహత్యలపై 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న కథనం.

### ఈ ఏడాది 244 మంది ఆత్మహత్య..

నిర్మల్ జిల్లాలోని 19 మండలాల్లో 2023 సంవత్సరంలో డిసెంబర్ నెల వరకు 244 మంది ఆత్మహత్య చేసుకున్నారు. జిల్లాలో గత ఐదేళ్ల నుంచి ఆత్మహత్యల నివేదికను పరిశీలిస్తే, ఏటా వీటి సంఖ్య పెరుగుతూనే ఉంది. 2019వ సంత్సరంలో 138 మంది, 2020లో 175. 2021లో 252, 2022లో 239 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 2023లో మళ్లీ వీటి సంఖ్య 244కి పెరిగింది. ఏటా జిల్లాలో ఆత్మహత్యల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూనే ఉందని గణాంకాలు చెబుతున్నాయి. బలమైన కారణాలు లేనప్పటికీ క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడుతున్నారు.



ఆత్యహత్య చేసుకున్న సురేష్ మృత దేహం ఫైల్..

### వీధిన పడుతున్న కుటుంబాలు..

కుటుంబ పెద్దల మరణాలతో వారిపైనే ఆధారపడిన కుటుంబాలు వీధిన పడుతున్నాయి. సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉన్నప్పటికీ వాటన్నింటినీ లెక్క చేయకుండా కేవలం చావుతోనే సమస్యకు పరిష్కారమని అపోహ పడుతున్నారు.

### కౌన్సెలింగ్ ఎంతో మేలు..

ఆత్మహత్యలకు గల కారణాలను కౌన్సెలింగ్‌తో సులువుగా పరిష్కరించుకోవచ్చని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఒక బలమైన సమస్య వచ్చిందంటే వాటిని పరిష్కరించే మార్గాలను వదిలేసి ఆ సమస్యను గోరంతదానిని కొండంతగా చేయడంతోనే అసలు సమస్య మొదలవుతుంది. ఇలా సమస్యను పరిష్కరించుకునే మార్గాలను తెలుసుకునేందుకు సైక్రియాట్రిస్టులను సంప్రదిస్తే వంద శాతం సమస్యను పరిష్కరించుకునే అవకాశాలు ఉన్నాయి.

### ముందే గుర్తించవచ్చు..



*ఆత్మహత్య చేసుకోవడం నేరం. ఆత్మహత్య చేసుకునే వారిని మనం ముందే గ్రహించవచ్చు. అలాంటి ఆలోచనలు వచ్చిన వారు ఒంటరిగా ఉండడం, మానవ సంబంధాలకు దూరంగా ఉండడం, తీవ్ర ఒత్తిడికి గురవ్వడంతో సెరిటోసైసిన్( సంతోషకరమైన) రసాయనాల శాతం తగ్గిపోతుంది. దీంతో మనిషికి ఆత్మహత్య చేసుకునే ఆలోచన పెరిగిపోతుంది. ఇలాంటి వాటికి అనేక కారణాలు తోడుకావచ్చు. ఉద్యోగం లేకపోడం, తల్లిదండ్రులు, సమాజం వారిని చిన్న చూపుచూడడం ఇలా అనేక కారణాలు కావచ్చు. తీవ్ర ఒత్తిడికి గురైన వ్యక్తులు తన ప్రాణ స్నేహితులతో బాధను పంచుకోవాలి. అయినా ఆత్మహత్యకు దారి తీసే ఆలోచనలు వచ్చినా సైక్రియాట్రిస్టులను సంప్రదిస్తే మంచి కౌన్సెలింగ్ అందించి వారి ప్రాణాలను నిలబెడుతాం.*

*-ప్రొఫెసర్, డాక్టర్ విశాల్ న్యూరో సైక్రియాటిస్టు, నిజామాబాద్*



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

## ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా తీసుకోవాలి

### ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 2 : ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా తీసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద(టీ) గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పథకాలతోపాటు వచ్చే ఇతర దరఖాస్తులను తీసుకోవాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరినీ ఎంపిక చేసి గ్యారెంటీ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు దరఖాస్తు నమోదులో అవగాహన కల్పించడంతోపాటు సహకారాన్ని అందించాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటీ టవర్ మంజూరు ఘనత బీఆర్ఎస్‌దే..

ఎదులాపురం, జనవరి 2 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ఐటీ టవర్‌కు రూ.40 కోట్లు మంజూరు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని, ఇందుకోసం మాజీ మంత్రి జోగు రామన్న ప్రత్యేక కృషి చేశారని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మంగళవారం ఐటీ టవర్ నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. టవర్ నమూనాను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ఐటీ టవర్ పనులను ఎటువంటి అడ్డంకులు లేకుండా పూర్తి చేయించాలని, ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ దృష్టి సారించాలని కోరారు.


